క్లుప్తంగా

పశుగణనపై శిక్షణ



మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 21వ అఖిల భారత పశుగణన-2024పై సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకొకసారి నిర్వహించే పశుగణనను పక్కాగా చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఇందుకోసం ఉపయోగించాలన్నారు. వివిధ పశుసంవర్ధక శాఖ పథకాల ప్రణాళిక రూపకల్పన, పశువైద్యం, వ్యాక్సిన్లు, మందుల పంపిణీకి ఈ పశుగణన మూలాధారమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్వీ శ్రీకాంత్‌బాబు, ఉమామహేశ్వరి, మునిరాజా, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి



హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద శుక్రవారం సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునేలా ఆర్జిత సేవగా తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం, విశేషాలంకరణ చేవారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

జూదం ఆడితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఎవరైనా జూదం ఆడినా, నిర్వహించినా, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిమ్మయ్య తెలిపారు. ఆయన శుక్రవారం ఎస్ఐ విశ్వనాథనాయుడుతో కలసి స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోడిపందేలు, పేకాట, జూదం, ఆడుతూ పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. చోరీలకు పాల్పడితే జైలుతోపాటు జరిమానా ఖాయమన్నారు. ద్విచక్ర వాహనచోదకులు ట్రిబుల్ రైడింగ్ చేసినా, ఆటోవాలాలు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలించినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ మెయిన్‌రోడ్డుకిరువైపుల, షాపు ఎదుట ఆటోలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటామని, సమస్యలుంటే 9440900723 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ముక్కంటి సేవలో అనంతపురం ఎంపీ



ఎంపీ అంబికాలక్ష్మీనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయాధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శుక్రవారం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ



సహపంక్తి భోజనం చేస్తున్న అధికారులు

నారాయణవనం: మండలంలోని ఎస్సీ హాస్టళ్లను శుక్రవారం సాయంత్రం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సోషల్ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ డీడీ చంద్రశేఖర్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, గదులను పరిశీలించారు. నారాయణవనం ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆదిమూలం మీడియాతో మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలోని 50 హాస్టళ్లలో చేపట్టాల్సిన మరమ్మతులు, కల్పించాల్సిన వసతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తామన్నారు.

మహిళలపై దాడులు తగవు



మహిళలు, యువతులు, చిన్నారులపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయి. కోల్‌కతాలో రోగులకు నిస్వార్థంగా సేవలందించే జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను పరిశీలిస్తే మనం ఎటువంటి సమాజంలో బతుకుతున్నామోనని భయమేస్తోంది. నిందితులను బహిరంగంగా ఉరితీయాలి. సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు, దాడులు తగవు. మహిళలను చూసే కోణంలో మార్పు రానంత కాలం ఇలాంటి దౌర్భాగ్యపు ఘటనలు జరుగుతూనే ఉంటాయి. - డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి, మండల వైద్యాధికారి, రేణిగుంట

చట్టాలు కఠినతరం కావాలి



దాడులకు పాల్పడే వారిపై అమలవుతున్న చట్టాలు మరింత కఠినతరం కావాలి. వైద్యసేవలందిస్తున్న డాక్టర్లపై దాడులకు పాల్పడేవారిపై చర్యలకు చట్టాలు, న్యాయస్థానాలు ఉపేక్షించకూడదు. ఇలాంటి కేసులకు న్యాయపరంగా సత్వర తీర్పులు రావాలి. దాడులకు గురైన వారికి, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలిచి, మనోధైర్యాన్ని నింపడంలో అందరూ ఏకమవ్వాలి. బాధితులకు న్యాయం చేయడంలో ప్రాధాన్యత ఇవ్వాలి.

–డాక్టర్ దర్శిత్ రాజ్, మెడికల్ ఆఫీసర్, నారాయణవనం.

భద్రత కల్పించాలి



రాత్రిపూట వైద్యశాలలకు వస్తున్న రోగులతోపాటు సహాయకులుగా వస్తున్నవారు మద్యం సేవించి వస్తున్నారు. బాధితులతో వచ్చిన వారు వైద్యుల సమస్యలను అర్థం చేసుకోకుండా దాడులు, గొడవలకు దిగుతున్నారు. వారిని ఎలా అడ్డుకోగలం. ఈ తరహా ఘటనలెన్నో ఉన్నాయి. రాత్రి పూట పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేసి, భద్రత కల్పించాలి. ప్రాణలు పోసే వైద్యులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదు.

–డి.లావణ్య, సివిల్ సర్జన్, పీహెచ్‌సీ పాండూరు

సమస్యలకేం తెలుసు అధికారులు లేరని..



నివేదికలు, ప్రతిపాదనల సమర్పణ.. ప్రణాళికల రూపకల్పనే అభివృద్ధికి కీలకం. వీటిని తయారు చేసే పలు ప్రభుత్వ శాఖల్లో కీలక అధికారుల పోస్టులన్నీ ఖాళీ.. ఇన్‌చార్జిల పాలన.. వెరసి పరిష్కారానికి నోచని సమస్యలు..కుంటుపడుతున్న ప్రగతి. ఇదీ ప్రఖ్యాత పారిశ్రామిక వాడ ఉన్న ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని వరదయ్యపాళెం మండల దుస్థితి.

- అధికారుల కొరత
- భర్తీకి నోచుకోని పోస్టులు
- పలు శాఖల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

వరదయ్యపాళెం: మండలాన్ని అధికారుల కొరత వెంటాడుతోంది. పలు కీలక శాఖలకు మండల స్థాయి అధికారులు లేక ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. దీంతో ఆయా శాఖల్లో ఫైళ్లు ముందుకు కదలక అభివృద్ధి కుంటుపడుతోంది. తాజాగా జరుగుతున్న అధికారుల బదిలీల్లో అయినా ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అవుతాయో లేదోనన్న అయోమయ పరిస్థితి తలెత్తుతోంది.

పంచాయతీలకు కార్యదర్శుల కొరత

మండలంలో పలు పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులు లేరు. కొందరు ఉన్నత చదువుల పేరిట సెలవుపై వెళుతుండగా, మరికొన్ని చోట్ల పంచాయతీలకు కార్యదర్శులు లేక ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. మండలంలో 29 పంచాయతీలుండగా 12 పంచాయతీలకు కార్యదర్శులు లేరు. ముస్లింపాళెం, కురింజల్లం, వరదయ్యపాళెం-2, తొండూరు సాసైటీ, మత్తేరిమిట్ట, కారిపాకం, గూడలవారిపాళెం పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరదవాడ, మావిళ్లపాడు, చిన్న పాండూరు పంచాయతీ కార్యదర్శులు ఉన్నత చదువుల కోసం సెలవుపై వెళ్లగా కడూరు కార్యదర్శి డిప్యుటేషన్‌లో ఉన్నారు. దీంతో ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతున్నాయి.

కీలకమైన పంచాయతీరాజ్‌కే ఇన్‌చార్జి

మండలంలో ఎంతో కీలకమైన పంచాయతీరాజ్ శాఖకు గత రెండేళ్లకు పైగా మండల ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో బీఎన్‌కండ్రిగ మండలానికి చెందిన ఏఈ నాగరాజు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో బిల్లులు పెండింగ్ పడడంతోపాటు అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు.

ఇరిగేషన్‌కూ ఇబ్బందులే

మండలంలో 29 పంచాయతీల్లో 80 సాగునీటి చెరువులున్నాయి. వీటి పర్యవేక్షణ కోసం ఇరిగేషన్ శాఖకు రెండు అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులను ప్రభుత్వం కేటాయించింది. అయితే మండలంలో సెక్షన్-2కు మాత్రమే ఏఈ ఉన్నారు. సెక్షన్-1 ఏఈ పోస్టు ఏడాదికి పైగా ఖాళీగా ఉంది. బీఎన్‌కండ్రిగ ఇరిగేషన్ ఏఈ మునిమోహన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఆరునెలలుగా ఆర్‌డబ్ల్యూఎస్‌కూ అధికారి లేరు

గ్రామీణ తాగునీటి సరఫరాలో ఎంతో కీలకమైన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు మండలంలో ఆరు నెలల నుంచి అధికారి లేరు. ఇక్కడ పనిచేస్తున్న ఆ శాఖ ఏఈ దేవకి సెలవుపై వెళ్లారు. దీంతో మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తినా పట్టించుకునే దిక్కు లేదు. పాండూరు సచివాలయానికి చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.



మూతపడిన హౌసింగ్ కార్యాలయం



వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయం

వెలుగుకూ ఇన్‌చార్జి ఏపీఎం

మండలంలో వెయ్యికి పైగా డ్వాక్రా సంఘాలున్నాయి. వీరికి రుణాలు మంజూరు, రికవరీ చేయాలంటే ఏపీఎం ఉండాలి. అయితే ఏడాది క్రితం ఈ శాఖలో రూ.3 కోట్లకు పైగా అక్రమ రుణాలు పొందిన ఏపీఎంను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి అధికారి లేరు. ఇటీవల నాగలాపురం ఏపీఎం సీతారామ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఏడాదిన్నరగా హౌసింగ్ ఏఈ పోస్టు ఖాళీ

గత ప్రభుత్వంలో మండలంలోని 29 పంచాయతీల్లో 1300 పక్కాఇళ్లు మంజూరు చేసింది. ఇందులో 600 పైచిలుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు హౌసింగ్ ఏఈ లేరు. ఏడాదిన్నరగా ఏఈ పోస్టు భర్తీకి నోచుకోలేదు. బీఎన్‌కండ్రిగ, తడ మండలాలకు చెందిన ఏఈలు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. మండల హౌసింగ్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కూడా రావడం లేదు. దీంతో ఆరునెలలుగా కార్యాలయం మూతపడి ఉంది.

ప్రభుత్వానికి నివేదించాం



మండలంలో వివిధ శాఖల్లో పోస్టుల ఖాళీ ఉన్న విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించాం. మండల స్థాయిలో ఆయా శాఖల పర్యవేక్షణ చేపట్టే ఇంజినీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోల కొరత విషయాన్ని కూడా ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

–ప్రసాద్, ఎంపీడీఓ, వరదయ్యపాళెం

రెవెన్యూలోనూ అదే పరిస్థితి

భూ సమస్యల పరిష్కారంలో ఎంతో కీలకమైన రెవెన్యూ శాఖలో వీఆర్వోలు, కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో 13 సచివాలయాలు ఉండగా 10 సచివాలయాలకే వీఆర్వోలు ఉన్నారు. మిగిలిన వాటికి వీఆర్వోలు లేరు. అలాగే ఇద్దరు ఆర్ఐలు ఉండాల్సి ఉండగా ఒకరే ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

పంచాయతీల పర్యవేక్షణకు కీలకమైన ఈఓపీఆర్డీ పోస్టు ఏడాదిగా భర్తీ కాలేదు. దీంతో సీనియర్ పంచాయతీ కార్యదర్శి అయిన చిరంజీవి ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు.

28న ముక్కంటి హుండీల లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఈ నెల 28వ తేదీన లెక్కించనున్నట్లు ఈఓ ఎస్వీఎస్ఎన్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని ప్రధాన హుండీతో పాటు పరివార దేవతల హుండీల లెక్కింపు గురుదక్షిణా మూర్తి సన్నిధిలో లెక్కించనున్నటు తెలిపారు.

అధ్యయన కేంద్రంగా జెడ్పీ హైస్కూలు

శ్రీకాళహస్తి: దూరవిద్యా విధానంలోని పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల అధ్యయన కేంద్రంగా పానగల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల సేవలు అందిస్తోందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ అధ్యయనకేంద్రం ద్వారా జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందినట్లు తెలిపారు. వీటి ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



మందులు అందజేస్తున్న వెటర్నరీ ఏడీ సునీత

రేణిగుంట: వర్షాకాలంలో పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సునీత తెలిపారు. మండలంలోని ఆర్.అగ్రహారంలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి తీసుకొచ్చిన పశువులు, జీవాలు, దూడలకు వైద్య పరీక్షలు చేసి, మందులను ఉచితంగా అందజేశారు. పశువుల్లో పిడుదుల నివారణకు బూటాక్స్ మందు పిచికారీ చేయించా రు. ఏరియా వెటర్నరీ డాక్టర్ శ్రవంతి, ట్రస్టీ సుబ్బరత్నమ్మ, సిబ్బంది గిరిప్రసాద్, ఇందుమతి, అన్నలగన్ ,స్వాతి, శంకరయ్య, గోపాల మిత్రలు ముని, లోకేష్ పాల్గొన్నారు.

భారత్ అగ్రగామిగా నిలవాలి



రేణిగుంటలో ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని శివాత్మిక

రేణిగుంట: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అగ్రగామిగా నిలవాలని రేణిగుంట బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధనం అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శుక్రవారం రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో జిల్లాస్థాయి స్పేస్‌డే నిర్వహించారు. విద్యార్థులకు మోడల్ మేకింగ్, క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. మోడల్ మేకింగ్ విభాగంలో గైడ్ టీచర్ కేవీ శ్యామలత పర్యవేక్షణలో విద్యార్థిని డీసీ శివాత్మిక జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచి ప్రశంసాపత్రాన్ని అందుకుంది.

విద్యార్థినికి అభినందన

నారాయణవనం: చంద్రయాన్-3 మోడల్ తయారీలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థిని శివాత్మికను నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శశికళ అభినందించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ రేణిగుంటలో జాతీయ స్థాయి చంద్రయాన్-3 మోడల్ మేకింగ్, క్విజ్, పోస్టర్ మేకింగ్‌లో పోటీలను నిర్వహించారన్నారు. ఆపోటీల్లో తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని శివాత్మిక ప్రథమ బహుమతిని సాధించిందని చెప్పారు. ఈ సందర్భంగా శివాత్మికను, గైడ్ టీచర్ శ్యామలతలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల నిరసన

శ్రీకాళహస్తి: తమకు జీతాలు చెల్లించాలని మదనపల్లె-నాయుడుపేట రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న మెఘా సంస్థలో పనిచేసే కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు బేస్ క్యాంపు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా తమకు జీతాలు అందడంలేదని వాపోయారు. పూట గడవడానికి కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉప ముఖ్యమంత్రికి స్వాగతం



పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ

రేణిగుంట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్డీఓ రవి శంకర్‌రెడ్డి, ప్రోటోకాల్ ఎస్‌డీసీ చంద్రశేఖర్, అటవీశాఖ సీసీఎఫ్ చంద్రశేఖర్‌రావు, డీఎఫ్ఓ సతీష్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో అన్నమయ్య జిల్లాలోని పలు గ్రామ సభల్లో పాల్గొనడానికి బయలుదేరి వెళ్లారు.

సేవలకు(విద్యుత్)షాక్

- షార్ట్ సర్క్యూట్‌తో పాడైన కంప్యూటర్లు
- నాలుగు రోజులుగా ఆగిన ప్రభుత్వ సేవలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



పాడైన కంప్యూటర్లు

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ సచివాలయంలో తలెత్తిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ సేవలకు అంతరాయం ఏర్పడింది. వారం రోజులుగా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు ఆగిపోయినా పట్టించుకునే దిక్కు లేదు. వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వచ్చే అర్జీదారులు ఇక్కట్లు పడ్డారు. తక్షణమే స్పందించి పాడైన కంప్యూటర్లను బాగు చేసే ప్రయత్నం ఏ ఒక్కరూ చేపట్టకపోవడం గమనార్హం. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా పాడైన కంప్యూటర్లను బాగు చేయించి, త్వరలో సచివాలయ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అప్పటి వరకు సమీపంలోని సచివాలయంలో అర్జీదారులకు సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి సర్కార్‌పై జనాగ్రహం

- సమస్యలు పరిష్కరించలేదని మండిపాటు
- తూతూ మంత్రంగా గ్రామసభలు



వేదం గ్రామసభ మధ్యలో విసుతిరిగిన ప్రజలు

శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు అధికారులు, టీడీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉండడంతో ప్రజల ముందుకు వచ్చిన అధికారులు, టీడీపీ నాయకులను ప్రజలు నిలదీయడంతో తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహించారు. శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని 44 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంపై శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో పదవుల్లో లేని స్థానిక టీడీపీ నాయకులకు, సర్పంచ్‌లకు సమానంగా కుర్చీలు వేసి, వేదికపైన కూర్చోబెట్టారు. వేదం పంచాయతీలో గ్రామసభ మధ్యలోనే ప్రజలు వెళ్లిపోయారు. రామాపురంలో 12 గంటలకే ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చేయి. ఎంపీడీఓ పఠాన్‌రఫీ ఖాన్, తహసీల్దార్ సత్యనారాయణ, మండల అధికారులు గ్రామ సభల్లో ప్రత్యేక అధికారులుగా పాల్గొన్నారు.



రామాపురంలో మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

తూతూమంత్రంగా గ్రామసభలు

ఏర్పేడు: మండలంలోని గ్రామాల్లో తూతూ మంత్రంగా గ్రామసభలు జరిగాయి. గ్రామాల్లో టీడీపీ నాయకులు అధికారులను డమ్మీ చేసి ప్రవర్తించారు. గ్రామాలన్నింటిలో ఒకే రోజు సభలు ఏర్పాటు చేయడంతో నాయకులు గంటల తరబడి నిర్వహించాల్సిన సభలను 10 నుంచి 20 నిమిషాల్లో ముగించి మమా అనిపించారు.

సద్వినియోగం చేసుకోండి

రేణిగుంట: ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి కోరారు. మండలంలోని అత్తూరులో గ్రామ సర్పంచ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో చాలా చోట్ల టీడీపీ నాయకులు వేదికపై కూర్చుని సభలో పెత్తనం చెలాయించారు. అధికారులు వారికి వంతపాడారు.

సమస్యల పరిష్కారానికి వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామసభలలో పలు సమస్యలను పరిష్కరించాలని ప్రజలు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు.

మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

సత్యవేడు: పంచాయతీ పరిధిలో చేపట్టే గ్రామ సభల్లో గ్రామాల మౌళిక వసతులు కల్పించే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ శంకర్ నారాయణ అన్నారు. శుక్రవారం నిర్వహించన సత్యవేడు గ్రామసభను ఆయన పరిశీలించారు. సర్పంచ్ మంజుల అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ ఈఓపీఆర్డీ మునిరవికుమార్, ఏఈ దేవీప్రసాద్ పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ చిన్నదొరై సుధా అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత, వార్డు సభ్యులు సునీల్ కుమార్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రకేసరి జయంతి



నివాళులర్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



సత్యవేడు: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతుల జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఎంఈఓ రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. బ్రిటిష్ తుపాకులకు ఎదురొడ్డి నిలిచిన మహానుభావుడు ఆంధ్రకేసరి అని కొనియాడారు.

ఉప్పుసత్యాగ్రహంలో 'ఆంధ్రకేసరి'

సత్యవేడు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఉప్పు సత్యాగ్రహంలో కీలక పాత్రను పోషించారని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి తెలిపారు. శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. వెంకటేశ్వర్లు, మనోహర్, వైవీఎల్ ప్రసాద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి మారుపేరు టంగుటూరి



ఏర్పేడు: నివాళులర్పిస్తున్న ఎంఈఓ దయాకర్

ఏర్పేడు: టంగుటూరి ప్రకాశం త్యాగానికి మారుపేరని ఎంఈఓ-2 దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు దేవరాజులు, వెంకటేశ్వర్లు, ఉషారాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



విజేతలతో హెచ్‌ఎం భారతి

సత్యవేడు: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండా, క్రీడా జెండాను హెచ్‌ఎం భారతి ఎగురవేసి క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఏటా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలు ద్వారా విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. పలు విభాగాల్లో పరుగుపందేలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని సంతోష్, ద్వితీయ బహుమతి గౌతమ్, తృతీయ బహుమతికి కిరణ్ సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయులు భారతి బహుమతులు అందజేశారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా జరిగింది. అమ్మవారికి విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, మత్స్యబానిసల పునరావాస కేంద్రం డైరెక్టర్ అన్నాదొరై, ప్రతినిధులు వెంకట్‌కుమార్, మునీంద్ర, మునిపార్థసారథి, మహిళలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మహిళలు